క్లుప్తంగా

బీఆర్‌ఎస్ కమిటీల సమావేశం



మాట్లాడుతున్న ఎస్‌ఏ.రజాక్

మద్దిరాల : అందరం కలిసి కట్టుగా పనిచేసి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను మూడోసారి గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 197, 198 బూత్ కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పరిశీలకులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో బూత్ ఇన్‌చార్జ్‌లను, 100 ఓటర్లకు ఓ ఇంచార్జీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వద్దాణం మధుసూదన్, వెంకట్‌రెడ్డి, శివారెడ్డి, బీఎస్ ముదిరాజ్, మల్యాల నర్సయ్య, కొలగాని వెంకన్న, సమ్మయ్య, రవీందర్, భిక్షపతి, కంట్లం, భూతం వీరయ్య, పగిండ్ల భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోసం దరఖాస్తు తీసుకోవాలని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఎంఈసీ గ్రూపులకు గాను దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారాగాని, నేరుగా కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఏపూరి సోమన్న

నాగారం : మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన సుంకరి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు దున్నపోతుల చంద్రశేఖర్, చింతకుంట్ల పరమేష్, ఏపూరి యాకన్న, షేక్. అక్బర్, బషీర్, మందుల రాములు, శ్రీను, విష్ణు, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్న నియామకంపై హర్షం

నూతనకల్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చెవిటి వెంకన్న యాదవ్‌ను రెండోసారి నియమించడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లం కృష్ణారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వెంకన్నను నియమించడం పట్ల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మండల అధ్యక్షుడిగా కరుణాకర్



నియామక పత్రాన్ని అందజేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల మున్నూరుకాపు యువక మండలి అధ్యక్షుడిగా పర్సాయపల్లికి చెందిన కడారి కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్, జిల్లా యువక మండలి అధ్యక్షుడు నల్లగుంట్ల సందీప్, పర్సాయపల్లి సర్పంచ్ పుప్పాల శేఖర్ గురువారం సూర్యాపేటలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పి.ప్రభాకర్, సోమశేఖర్, రవికాంత్, ఏకస్వామి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల ప్రారంభంలోగా పనులయ్యేనా..

- నత్తనడకన కొనసాగుతున్న మన ఊరు – మన బడి కార్యక్రమం
- ఇంకా పలు పాఠశాలల్లో ప్రారంభంకాని పనులు



ఏపూరులో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

ఆత్మకూర్ (ఎస్) : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. మన ఊరు మన బడి పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చాలని భావించి అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా మొదటి విడత మండల వ్యాప్తంగా 20 పాఠశాలలను గుర్తించి నిధులను సైతం విడుదల చేశారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపమో.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనమో.. మండల వ్యాప్తంగా ఈ పథకం నత్తనడకన సాగుతోంది. 25 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మన ఊరు – మన బడిలో అన్ని సౌకర్యాలతో కూడిన పాఠశాలలు విద్యార్థులకు అందుబాటులోకి రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.34.45 కోట్లు మంజూరు..

మండల వ్యాప్తంగా 40 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మన ఊరు–మన బడి కింద తొలి విడతలో 20 పాఠశాలలను ఎంపిక చేసి రూ.34.45 కోట్లను మంజూరు చేశారు. ఇందులో 13 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో భవనాల మరమ్మతు, అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, లైబ్రరీ, బ్లాక్ బోర్డు, డిజిటల్ క్లాస్‌లు, కరెంటు సౌకర్యంతో మెరుగైన వసతులు కల్పించనున్నారు. ఏపూరు, కోటపహాడ్ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నా.. ఈ భవనాలు అందుబాటులోకి రావడం అనుమానంగానే ఉన్నాయి. మరికొన్ని చోట్ల మరుగుదొడ్ల పనులు ప్రారంభమై 50 శాతమే పూర్తయ్యాయి. చాలావరకు పాఠశాల్లో నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఈ పాఠశాల్లో పనులు ప్రారంభమయ్యేది, పూర్తయ్యేది ఎన్నడోనని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



మన ఊరు–మన బడి పథకంతో పాఠశాలలకు మహర్దశ వచ్చింది. విద్యార్థులకు సకల వసతులతో పాఠశాలలు అందుబాటులో ఉండనున్నాయి. కానీ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ విద్యాసంవత్సరం అందుబాటులోకి ఎప్పుడొస్తాయో తెలియదు. అప్పటి వరకూ విద్యార్థులకు అసౌకర్యం తప్పదు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

– మధుసూదన్, ఎస్‌ఎంసీ చైర్మన్

ఆస్పత్రి ఎదుట ప్రమాదాల భయం



ఆస్పత్రి ఎదుట రోడ్డుపై నిలిపిన బండ్లు

దురాజ్‌పల్లి : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా ప్రమాదాల భయం నెలకొంటున్నది. పండ్లు, టిఫిన్స్ విక్రయించే వ్యాపారులు తమ బండ్లను హాస్పిటల్ ప్రధాన గేటుకు దగ్గరగా నిలపడంతో బస్టాండ్ వైపు నుంచి వచ్చే వాహనదారులకు హాస్పిటల్ నుంచి బయటకు వచ్చే వాహనాలు కనబడక నిత్యం ప్రయాదాలు జరుగుతున్నాయి. హాస్పిటల్ ఎదురుగా మాత్రమే యూ టర్న్ ఉండటంతో వాహనదారులు ఈ రోడ్డులో వెళ్లక తప్పడం లేదు. ముఖ్యంగా టిఫిన్ బండ్ల వద్ద అధిక సంఖ్యలో ప్రజలు నిలబడటం, రోడ్డుపై కుర్చీలు వేసి కూర్చోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. అదే విధంగా ఇక్కడకు టిఫిన్ చేసేందుకు వచ్చే వారు రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో మోహం కడుగుతున్నారని, దీంతో రోగాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. ఇక్కడ ఉన్న తోపుడు బండ్లను మరో చోటకు తరలించాలని కోరుతున్నారు.

ఆలయంలో రుద్రాభిషేకం

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ మనోహరశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న అర్చకుడు సాయిరాం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగి షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చనలు, మధ్యాహ్నహారతి నిర్వహించారు. అనంతరం దాతలు గుంటూరు జిల్లా మైన్స్ ఏజీ టి.కిశోర్‌బాబు, స్థానికులు ఈర్ల చంటి, మామిడి నవీన్ 200మందికి అన్నదానం చేశారు. అలాగే సాయంత్రం సాయంత్ర హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర అర్చకుడు కండవల్లి సాయిరాం, ఉపాధిహామీ ఏపీఓ సీహెచ్.ఉపేందర్, సీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బలి సుధీర్‌రెడ్డి, ఈసీ నగేష్, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి, మండల విద్యుత్ ఏఏఈ వాస శ్రీకాంత్, సబ్ ఇంజనీర్ గిరిబాబు, వీఆర్‌ఏలు, విద్యుత్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తుదిదశకు 'కంటి వెలుగు'

- జాజిరెడ్డిగూడెం మండలంలో 13 గ్రామపంచాయతీల్లో పూర్తి
- ప్రస్తుతం మూడు జీపీల్లో కంటి వెలుగు శిబిరాలు
- ఈనెలాఖరుతో కంటి పరీక్షలు పూర్తి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి చినపాక మణిరత్నం

అర్వపల్లి : నేత్ర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోంది. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జనవరి 19న మండలంలో మొదలైంది. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 13 గ్రామపంచాయతీల్లో కంటి పరీక్షలు పూర్తి చేశారు. 17గ్రామ పంచాయతీలకు గాను ప్రస్తుతం 3 పంచాయతీల్లో కంటి పరీక్షలు జరుగుతున్నాయి. చివరగా బొల్లంపల్లి గ్రామంతో కంటి వైద్య శిబిరం పూర్తికానుంది. ఈ నెలాఖరుతో కంటి పరీక్షలను పూర్తి చేయనున్నారు. కాగా కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తుంది.

1800 మందికి రీడింగ్ గ్లాస్‌లు పంపిణీ..

జాజిరెడ్డిగూడెం మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో ఇప్పటి వరకు 12వేల మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 1800 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. అలాగే ప్రత్యేక అద్దాలు (దూరపు చూపు) 1600 మందికి అవసరముండగా ఇప్పటి వరకు 1100 మందికి అందించారు. మిగిలిన 500 మందికి ప్రత్యేక అద్దాలు రావాల్సి ఉంది. అలాగే ఇప్పటి వరకు 350 మందిని కంటి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. కాగా ప్రస్తుతం అర్వపల్లి, కుంచమర్తి, పర్సాయపల్లి గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలు జరుగుతున్నాయి. ఇది కాగానే బొల్లంపల్లిలో చివరగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించి ఈనెలాఖరుతో కంటి పరీక్షల కార్యక్రమంను పూర్తి చేయనున్నారు.

అద్దాలు బాగున్నాయి



కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్ష చేయించుకున్నాను. దగ్గరి చూపు కోసం అద్దాలు తీసుకున్నాను. ఈసారి అద్దాలు బాగున్నాయి. కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి.

– గుయ్యని బాబు, సర్పంచ్, కోదూరు

13 పంచాయతీల్లో పరీక్షలు పూర్తి



జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామపంచాయతీలకు ఇప్పటి వర కు 13 జీపీల్లో పరీక్షలు పూర్తి చేశాం. మిగిలిన 4 పంచాయతీలకు గాను ప్రస్తుతం మూడు పంచాయతీల్లో శిబిరాలు జరుగుతున్నాయి. బొల్లంపల్లి గ్రామంతో ఈనెలాఖరుకు కంటివెలుగు కార్యక్రమం పూర్తికానుంది.

– డాక్టర్ చినపాక మణిరత్నం, వైద్యాధికారి

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

చివ్వెంల : తాము విక్రయించిన ధాన్యం నుంచి తరుగు పేరుతో క్వింటాకు 5 కేజీలు కోత విధిస్తున్నారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మిల్లర్ల పేరుతో కొనుగోలు కేంద్రం సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి 58 లారీల ధాన్యం ఎగుమతి చేశామని అన్నారు. అందులో ఇటీవల ఆరు లారీలకు మాత్రమే మిల్లర్లు కోత విధించారని, మిల్లర్లు చేసిన దానికి తమను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సిబ్బంది ఎవరైన అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, దూపహాడ్ తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేసి, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. వారం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, ఈసీ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల సన్నాహక సమావేశం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నడిగూడెం : కోదాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి కోరారు. గురువారం సిరిపురం, వేణుగోపాలపురం గ్రామాలలో సన్నాహక సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా గ్రామాలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వేపూరి సుధీర్, సిరిపురం, కరివిరాల సర్పంచ్‌లు మొక్క లక్ష్మీవీణ, గుర్రం నీలిమా గాంధీ, నాయకులు మొక్క భిక్షపతి, శెట్టి సతీష్, ఎలుగూరి నాగరాజు, వీరయ్య, సోమయ్య, రేపాల పురుషోత్తం, ఉపేందర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల నిర్వహణలో పారదర్శకత లేకుంటే చర్యలు



నూతనకల్ : ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ సుందరి కిరణ్‌కుమార్



సూర్యాపేట రూరల్ : రామ్లతండాలో ఉపాధి పనులను ప్రారంభించిన జెడ్పీటీసీ జీడి భిక్షం

నూతనకల్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో పారదర్శకత లేనట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ సుందరి కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. 2019 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై ప్రజా వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో 1997పనులను చేపట్టగా రూ.18కోట్ల 40లక్షల 13వేల 565లు కూలీలకు, రూ. 2కోట్ల 50లక్షల 83వేల 805లు మెటీరియల్ కాంపొండెంట్ కింద చెల్లింపులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన తనిఖీ వివరాలను సామాజిక బృందం సభ్యులు ప్రజావేదికలో చదివి వినిపించారు. మండల పరిధిలోని బక్కహేమ్లా తండా గ్రామానికి చెందిన పాతులోతు హస్లీ 2019లో చనిపోగా 2022 సంవత్సరంలో వారం రోజులు పనికి వెళ్లినట్లు మస్టర్‌లో పేరు నమోదు చేసి బిల్లు డ్రా చేశారన్నారు. లింగంపల్లిలో వరద కాల్వ లేనప్పటికీ పనులు చేపట్టినట్లు మస్టరు నమోదు చేశారని తెలిపారు. కొత్తతండాలో రూ. 4లక్షల వ్యయంతో చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు పనుల్లో కూలీల వివరాలు తెలిపే మస్టర్లు లేకపోవడంతో రూ. 4లక్షలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. బిక్కుమళ్లలో నాటిన మొక్కలకు వాటి సంరక్షణ కోసం నీటి సరఫరా చేయడం కోసం బిల్లుల చెల్లింపులో వ్యత్యాసం ఉందని తనిఖీ బృందం సభ్యులు నివేదిక సమర్పించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పనులకు వెళ్లినట్లు మస్టర్‌లో పేరు నమోదు చేశారని, నిబంధనల ప్రకారం ఆశా, గ్రామ పంచాయతీ వర్కర్లు పనులకు వెళ్లడానికి అర్హులు కారని సంబంధిత అధికారులపై చర్యలకు ఆదేశించారు. 17 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పనులకు, చెల్లింపులకు మధ్య వ్యత్యాసం ఉండటంతో రూ. 5లక్షల 45వేల 715లు రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్యామల, ఈసీ లక్ష్మయ్యలు కూలీలకు చెల్లించే చెల్లింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పని జరిగిన ప్రదేశాల్లో పని వివరాలు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకుండా నిధులు డ్రా చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, ఏపీడీ పెంటయ్య, ఎంపీడీఓ ఇందిర, ఏపీఓ మామిడి శ్రీరాములు, ఏపీఎం కర్ణాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి

సూర్యాపేట రూరల్ : ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, ఉపాధి హామీ కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని రామ్లతండాలో ఉపాధి హామీ పనులను ప్రారంభించి మాట్లాడారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేశారు. ఇమాంపేట గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు పారిశుద్ధ్య వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోతు స్వప్ననాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన



తిరుమలగిరి : మాట్లాడుతున్న సర్పంచ్



ఆత్మకూర్(ఎస్) : ఏనుబాములలో కిశోర బాలికల సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

తిరుమలగిరి : లింగ వివక్షను రూపు మాపాలని మామిడాల సర్పంచ్ బెడిదె కరుణాకర్ అన్నారు. మార్పు సొసైటీ ఆధ్వర్యంలో మామిడాల గ్రామంలో గురువారం లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్పు సొసైటీ బాధ్యుడు విప్లవ్‌కుమార్, ఆశ వర్కర్లు మార్కు, విజయలక్ష్మి, మణెమ్మ, అనూష, పావని, కావ్య, గౌతమి, పూర్ణ చందన తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఆడపిల్లలపై చిన్న చూపు తగదని, ఆడపిల్లలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణించగలరని జన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏనుబాముల గ్రామంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తల్లితండ్రులు ఆడపిల్లలను చిన్నచూపు చూడవద్దని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని, అవకాశాలు కల్పిస్తే పురుషుల కంటే ఏ రంగంలోనూ తీసిపోరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ ఆర్గనైజర్ నాయిని సైదులు, ఎస్‌ఎంసీ చైర్మన్ యాదమ్మ, కిశోర బాలికలు స్పందన, ముదిగొండ వర్షిత, సుద్దాల సాయిసుధా, గంపల అక్షిత, పావని, రిషిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై కళాజాతా



బరాఖత్‌గూడెం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేష్

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఐ పిల్లి లోకేష్ గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు నియమ నిబంధనలు, సైబర్ నేరాలపై, షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లల భద్రత, మూఢ నమ్మకాలపై వివరించారు. 100 డయల్ గురించి, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్, టోల్‌ఫ్రీ నంబర్ 1930, సెల్ ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునగాల సీఐ పి.వీరరాఘవులు, జీఎమ్మార్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐలు కృష్ణమూర్తి, మల్సూర్, సూర్యాపేట షీటీమ్ ఎస్‌ఐ బాలునాయక్, షీటీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జాఫర్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ మహేశ్వరి, పోలీసు సిబ్బంది, పోలీసు కళాజాతా బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, గురులింగం, నాగార్జున, గ్రామప్రజలు పాల్గొన్నారు.

తారు రోడ్డు మంజూరు చేయాలి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో గల చెవ్వోరిగూడేనికి వెళ్లే దారిని తారు రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా కన్వీనర్ రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడారు. సుమారు నాలుగు మండలాలను కలుపుకొని వెళ్లే ఈ రోడ్డుకు తారు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి తారు రోడ్డు వేయకుంటే గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు బీఎస్పీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపంగ ఉపేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామస్వామి, కల్యాణ్ వర్మ, హరీష్‌రావు, సతీష్, తిప్పన శ్రీనివాస్‌రెడ్డి, అచ్చిరెడ్డి, లచ్చిరెడ్డి, బ్రహ్మచారి, పరిపూర్ణాచారి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

నేరేడుచర్ల : సీఎం కప్ క్రీడల్లో మండల స్థాయి విజేతలకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకరయ్య, మున్సిపల్‌కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నవీన్‌కుమార్, ఎంపీఓ విజయకుమారి, ఎంఈఓ చత్రునాయక్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి 25 చివరి తేదీ

మునగాల : మునగాల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2023– 24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ఒక్కో విభాగంలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు tsms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు పత్రం, ఎస్‌ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను పాఠశాల కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మాదిగలను మోసంచేసిన ప్రభుత్వాలు

నడిగూడెం : రానున్న ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేపడుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, వర్గీకరణపై బిల్లును ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పందిటి నవీన్, గంటెపంగు సమృత్, భార్గవ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోదాడరూరల్ : కాపుగల్లు పీహెచ్‌సీ పరిధిలోని గుడిబండ, తొగర్రాయిలో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మాణ కమిటీ సభ్యులు గురువారం స్థలాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడారు. ఉపకేంద్రాల నిర్మాణానికి గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఇచ్చిన ప్రదేశాలను పరిశీలించి స్థలాల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అనంతరం ప్రజలకు అందుబాటులో ఉండే అనువైన స్థలంలో మూడు నెలల్లో భవనాలు నిర్మించేందుకు టీఎస్‌ఎంఐడీసీ అధికారులు పనులు మొదలు పెడతారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ విజయశ్రీ, పీఆర్ ఏఈ రాము, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ సుష్మ, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.